



"బ్రహ్మాండంగా వుందిరా బావా చుట్ట!...ఇంత బాగా చుట్టగలిగి నందుకయినా నువ్వు వొకసారి దాన్ని తగలెయ్యాలి.'' అన్నారు చౌదరి మిత్రుడు అందించిన చుట్టను పరీక్షిస్తో.

"వొద్దులేరా అబ్బీ! ఉన్న అలవాట్ల తోటే చస్తుంటే ఈ తగలాటంకూడా దేనికి!" అన్నారు శర్మ నవ్వి.

"ఉన్న అలవాట్లుట! ఏవి(ట్రా నీకు ఉన్న అలవాట్లు? కాఫీ తాగవు, పేక కాదుగదా చదరంగంకూడా ఆడవు. ఇహ ఏమిటి నీకు ఉన్న అలవాట్లు?"

"పోనీలే! అందువల్ల వొచ్చిన నష్టం ఏం లేదుగా?"

"లాభమూ లేదుగా?"

నవ్వి వూరుకున్నారు శర్మ.

ఊరి మధ్యనున్న రావిచెట్టు దగ్గరున్న రచ్చబండ అది. ప్రతి సాయంత్రమూ ఆ మిత్రు లిద్దరూ అక్కడ బైఠాయించి వూసులాడుకుంటూ వుంటారు వీలున్నప్పుడల్లా, ఆరోజులాగే. కరణం జగన్నాధం కూడా వొచ్చి ఆ మిత్రుల సంభాషణ వింటూ, తనూ పాల్గొంటూ వుంటాడు.

శర్మగారూ, చౌదరిగారు అరవయ్యో పడిలో వున్నవారు. అయినా దృఢకాయులు. ఆ ఇద్దరియందూ వూరిలో అపరిమితమయిన గౌరవమూ విశ్వాసమూ వున్నాయి.

శర్మగారు ఆవూరువొచ్చి స్థిర పడి అయి దారేళ్ళకన్నా ఎక్కువ కాలేదు. ఆయన గ్రాడ్యుఏటు. ప్రభుత్వం చాలించమన్నదాకా ఉద్యోగం చేసి, పిల్లల తాలూకు శుభకార్యాలన్నీ అయిపోయి, వాళ్ళు జీవితంలో స్థిరపడిపోగానే ఆయనా, భార్యా ఈవూరు జేరుకున్నారు. అక్కడ వారికి పిత్రార్జితమయిన భూమి వుంది. దాని అలనా పాలనా చూసుకుంటో, నలుగురికీ చాతనయిన సాయం చేస్తో అక్కడ వుండిపోయారు. సాయం మాట వొచ్చింది గనక చెబుతున్నాను వూళ్ళో ఎవరికి ఏ కష్టం వొచ్చినా స్వంతపనిలా బాధ్యత వహించి చేసేవాడు. పైగా ఆయనకున్న నియమాలూ మంచి నడవడి మూలానా, వూళ్లో అందరికీ తలలో నాలుకయి పోయాడాయన.

చౌదరిగారి తరహా వేరు. తన పనులేమిటో తనేమిటో తప్ప ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోని తత్వం ఆయనది. అయితే ఎవరయినా సాయం కోరి వొస్తే కాదని ఎరుగడు. శర్మగారూ, ఆయనా ఆబాల్య స్నేహితులు. ఇంటర్మీడియెట్‌తో చదువు ముగించి వ్యవసాయంలోకి ప్రవేశించాడాయన.

"అయితే బావా ఆ తిరపతాయిగాడి ఖర్మ అంతేనంటావా ? మంచి రోజులు వొస్తాయంటావా ?" అన్నారు చౌదరి.

"వాడి దయ" అన్నారు శర్మ ఆకాశం వేపు చూపించి.

"అంతేనంటావా ?"

"అలాగే ననిపిస్తోంది. రోగమూ మాయదారిది. దానికి తోడు వీళ్ళకి మూఢనమ్మకాలు జాస్తి మనం ఎంత చెప్పినా వింటున్నంతవరకే గాని ఆ తరువాత మామూలే. ఎలా బాగుపడతారో వీళ్ళు?"

"అయితే దయ్యాలూ అవీ బూటకాలేనంటావా అన్నయ్యా ?" అన్నాడు కరణం జగన్నాథం

"అంతేరా అబ్బీ ! మన మనసే అన్నింటికి కారణం

నవ్వారు చౌదరి

చౌదరి ఏదో అనబోయి అల్లంత దూరాన ఉరుకులూ పరుగుల్తో వొస్తోన్న వ్యక్తిని చూసి ఆగిపోయారు. అతనే



తిరపతాయి అతన్ని చూడంగానే "మళ్ళీ నీకు పని తగిలిందిరా బావా" అన్నారు చౌదరి. శర్మ పైపంచ దులిపి బుజాన వేసుకుని గట్టుదిగి నిలబడ్డారు. రోజుతో వొచ్చి ఆగిన తిరపతాయి "ఇంటిదానికి మల్లా ముంచుకొొచ్చింది బాబో! మీరు రావాల" అన్నాడు. శర్మ అతడి బుజం తట్టి "పద" అన్నారు. ఇద్దరూ కదిలారు. కను మరుగైందాకా వారివంకే చూస్తూ కూచున్న జగన్నాధం నిట్టూర్చి చౌదరి గారి వయిపు తిరిగి "ఏం జీవితాలు ?" అన్నాడు.

"ఏం కధ ?" అన్నారు చౌదరి.

వాళ్ళ సంగతే. ఒకరు సర్వసద్గుణ సంపన్నులూ, పరోపకార పారీణుడూను. తిరపతాయి సంగతి చెప్పనక్కర్లేదు కదా ? మూఢ నమ్మకాలకి, మూర్ఖత్వానికీ కొండగుర్తు."

చుట్టకొొన కొొరికి ఉమ్మేసి, చుట్ట వెలిగించుకుంటూ "సద్గుణాల పుట్ట అయిన మనిషి ఉంటాడంటావా ?" అన్నారు చౌదరి.

"ఎందు కుండరు ? ఉదాహరణకి మా అన్నగారి సంగతే తీసుకోండి. ఆయన్లో పగవాడయినా దుర్గుణాన్ని వేలెత్తి చూపగలఢా ?"

"దుర్గుణం వుంది అని ఎవరికీ తెలియక పోవచ్చును గదా ?"

"అంటే ? నాకు తెలియని దుర్గుణం ఆయన్లో ఉందంటారా ? ఛస్తే వొప్పుకొొను."

"అది తెలివయినమాట కాదు. అసలు దుర్గుణం అంటే అర్ధం ఏమిటి ? చెడ్డ పనులు చేసే గుణం అనే కదా ? చెడ్డపని ఒకసారి చేసినా పదిసార్లు చేసినా ఆ వ్యక్తి లోటు మనిషిగానే వ్యవహరింపబడుతాడు!"

"అలాంటి పనిచేశాడంటారా ఆయన? నాకు నమ్మకం కుదరడం లేదు"అన్నాడు జగన్నాధం ఆశ్చర్యంతో.

చుట్టపొొగ వదిలి నుసి రాలుస్తో చిన్నగా నవ్వారు చౌదరి. వెలుగు మాసి చీకటి పుడుతోంది. ఇళ్ళకు తిరిగిన శ్రామిక జనం ఆయన్ను చూసి దండాలు పెడుతో సాగిపోతున్నారు. ఒక్క క్షణం పాటు ఆయన మౌనంగా వూరుకుని "ఒక సంఘటన చెబుతాను విను. దీని మూలాన శర్మలో లోటు వుందని చెబుతున్నా ననుకోకు. వాడూ మనిషేగా మరి.

అప్పట్లో నేనూ, శర్మా గుంటూర్లో ఇంటర్ వెలిగిస్తున్నాం. చిన్నప్పటినుంచీ స్నేహితులం కావడం మూలాన కలిసి బ్రాడీపేటలో ఓ గది తీసుకుని వుండే వాళ్ళం. వాడు ఓ సదాచార పరాయణురాలయిన పూటకూళ్ళమ్మ యింటో భోజనం చేసేవాడు. నేను మిలిటరీ హోటల్లో భోంచేసే వాణ్ణి.

మేం వుంటున్న యింటి యజమాను రాలు శాకాహారి కాదు. అయినా శర్మకు అభ్యంతరం కలిగేలా ఏనాడూ ప్రవర్తించక పోవటాన మేం మరో చోటికి పోవల్సిన అవసరం కలగలేదు ఆవిడకి బంగారపు బొమ్మలాంటి కూతురు వుండేది. రోహిణి ఆ అమ్మాయి పేరు. అప్పటికే వివాహితుడు కావటం మూలానా, పైగా పరస్త్రీని చూడకూడదనే నియమం కలవాడు కావటం మూలానా శర్మ ఆ అమ్మాయి సంగతే పట్టించుకునే వాడు కాదు. నాకు మాత్రం ఆ అమ్మాయిని చూసినప్పుడల్లా నరాలు జివ్వుమనేవి ఎలాగయినా సరే ఆ అమ్మాయిని వివాహం చేసుకోవా లనిపించేది. రోజుకు నాలుగయిదు సార్లయినా ఆ అమ్మాయి నా కంట పడేది. ఆ సమయాన ఏదో పొడిచేద్దామని కూచున్నవాడిని కాస్తా భయంతో బిగుసుకుపోయి తెల్ల మొహం వేసే వాడిని. ఇలా కొన్నాళ్ళు గడిచాయి. ఒక నాడు ఇదికాదు పద్ధతి అనుకుని శర్మతో అన్నాను. "రోహిణిని చూశావుగదరా బావా ?" అని.

"ఆ" అన్నాడు వాడు నవ్వి.

"బావుంటుంది కదూ ?"

"ఆ"

"నాకు ఆ అమ్మాయిని చేసుకోవాలని వుందిరా"

దానికి వాడు చెప్పిన సమాధానం విని తెల్లబోయాను. "కొందరు స్త్రీలని చూసి ఆనందించాలేగాని దగ్గిర చేసుకుందా మనుకోకూడదురా బావా ! ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుని నువ్వు సుఖపడ లేవు " అన్నాడు వాడు. వొళ్లు మండి పోయింది నాకు. చూసి ఆనందించ టానికని కొందర్నీ, పెళ్ళి చేసుకోవటాని కని కొందర్నీ సృష్టించాడా విధాత ? వెధవ సిద్ధాంతాలూ వీడూను అనిపించింది.

నాలుగయిదు రోజులు గడిచాయి ఆరోజు కాలేజీకి పోతోండగా మా నాన్న దగ్గర్నుంచి ఉత్తరం వొచ్చింది ఓ సారి వొచ్చిపొమ్మని వెళ్ళాను. మామూలు పనే. పెళ్ళికూతురు అంటూ ఓ పిల్లని ఖాయం చేసుకోడానికి ఎవరూ నచ్చలేదు నాకు తిరిగి గుంటూరు జేరుకున్నాను. మా గదిముందు బండిదిగి లోపలకు ప్రవేశించేసరికి ఎదురయిన దృశ్యం నన్ను ఆశ్చర్యపోయేలా చేసింది. లావుగా పొట్టిగా వున్న వో ముసలమ్మ మూట సర్దుకుంటూ "రూపాయివ్వండి" అంటోంది శర్మ వళ్ళంతా చెమటలు దిగజారి పోతున్నాయి. తడబడుతోన్న గొంతుతో "బయటికిపద యిస్తాను" అంటున్నాడు ముసల్ది లేచి గుమ్మందాకా వెళ్ళింది. వాడు గది తాళం చెవులు తీసుకుని "ఏమిట్రా ?" అంటోన్న నా మాటలు వినిపించుకోకుండా బయటికి నడిచాడు. చేతి సంచి అక్కడ పడేసి నేనూ వాడితోపాటు యివతలికివొచ్చాను. వాడు ముసలిదానికి రూపాయిచ్చాడు.

ముసల్ది ఆ నోటు రొంటిన దోపుకుని "ఈసారొచ్చేతలికి పాతకోకియ్యాల" అనుకుంటో వెళ్ళిపోయింది. నా కేమీ అర్థంకాలేదు వాడు గదికి తాళంవేసి, నా బుజంమీద చేయివేసి భారంగా నిశ్వ సించి "అలా ఎక్కడికయినా పోదాం పద" అన్నాడు వాణుకు తగ్గని గొంతుతో. మనిషి బాగా డీలా పడిపోయాడు మా గదికి దగ్గర్లోనే చిన్న పార్కులాంటిది వుంది. ఇద్దరం పోయి అక్కడ ఓ మూలగా కూచున్నాం రొజటం తగ్గాక "ఏం జరిగిందిరా ?" అన్నాను.

"ఖర్మ. లేచిన వేళావిశేషం" అన్నాడు వాడు నెత్తి కొట్టుకుంటూ.

"చెప్పరా బాబూ ! ఎవరా ముసిల్ది ?" అన్నాను.

వాడు బాగా చలించిపోయా డన్నం దుకు నిదర్శనంగా నయనాలుకూడా చెమ ర్చాయి అద్దుకుని "చెబుతాను" అన్నాడు. నేను చెవులు రిక్కించుకు కూచున్నాను

"పొద్దున మామూలు ప్రకారం చదువు కుంటో కూచున్నాను గదిలో. ఒక అరగంట గడిచిందేమో ? ఆ ముసల్ది 'బాబూ' అంటో వొచ్చి గుమ్మంలో నిల బడింది. "ఇక్కడేంలేదు పో" అన్నాను. అంతటితో వొదలకుండా లోపలకు వొచ్చిందది. నాకు వొళ్ళు మండిపోయి కసురుకున్నా వినకుండా నేలమీద కూచుని "అలా కసురుకోకండి బాబయ్యా !... నాదగ్గిర బ్రెహ్మాండమయిన మందు లున్నాయి" అన్నది.

అంత కోపంలోనూ నవ్వొచ్చింది నాకు. ఓ పట్టాన వొదిలేట్టు కనపడలేదు నాకది. కనీసం కాసేపు తమాషా చేద్దా మనుకున్నాను. "ఏం మందు లున్నా యంటావు ?" అన్నాను.

"మారాజు ! ఏ దొడ్డబుద్ది నాకు తెలవదూ ?...అన్నిరకాల మందులూ వుండాయి." అని రహస్యం చెబుతోన్నట్లు మెల్లిగా "వసీకరణ వుంది వసీకరణం" అన్నది.

"ఎవర్ని వశం చేస్తుందంటావు?" అన్నాను

"ఎవరైనా సరే బాబయ్యా" అన్నది,

"ఒక అమ్మాయి వుంది. ఆ పిల్ల వశమవుతుందా?" అన్నాను.

"చిటికెలో అవుద్ది" అని సంచి లోంచి ఓ పొట్లం తీసింది "మీరు నాకేటీ యివ్యొద్దు వాడినాక గుణం సూబెడితే యియ్యండి" అన్నది

"ఏం చెయ్యాలంటావు?" అన్నాను.

"సెబుతాను ఆయమ్మ పేరేటి?" అన్నది

"రోహిణి" అన్నాను చటుక్కున.

"ఎక్కడుంటారు?"

"ఎక్కడోనా? పక్కగదిలో"

"ఎన్ని సమత్సరాలుంటయి?"

"పద్దెనిమిది లోపు"

ఆ ముసిల్ది ప్రశ్నలు ఆపేసింది. పొట్లం నా చేతులోపెట్టి కాసేపు ఏదో గొణిగింది ఆ తరువాత "ఆయమ్మను వొంటరి ఏల తల్సుకుని ఈ పొట్టం లోంది మూడుసార్లు అగ్గిలో ఎయ్యాల. మూడోపాలి ఏ సేతలికి ఆ యమ్మ నీ సరస నుంటది'' అన్నది.

ఈ తమాషా ఇక చాలు ననిపించింది. పొట్లం బల్లమీద పడేసి "సరే పోయిరా!" అన్నాను ఆ ముసిల్ది మూట కట్టేసుకుని ''నీపేర దురగమ్మపూజ సేయించాల. ఓ రూపాయియ్యి" అన్నది

నాకు వొళ్లమండి పొట్లం దానిమీద విసిరికొట్టి "తీసుక పో నీ పొట్లం'' అన్నాను కోపంగా

"అలాగంటా రేటండయ్యా" అన్నది జాలిగా.

''అంతే! పో అవతలకి'' అన్నాను

''మందు కావాలంటారుగా?''

''అఖ్ఖర్లేదు పో''

ఆ ముసల్ది వొక్కక్షణం వూరుకుని ''రోహిణమ్మగారు వొశం అవుతారని మందిస్తే డబ్బియ్యనంటారా పూజకి? అంతటోరు వొశం కావాలంటే చుల కనా?'' అన్నది తార స్థాయిలో.

ముచ్చెమటలు పోశాయి నాకు. ఆ మాటలు పక్క గదిలోకి వినబడితే? పరువు పోవటానికి తోడు వొళ్ళు వాలిక లవుతుంది. ఎంత అప్రదిష్ట! సొరుగులో వున్న రూపాయితీసి ''బయటికి పద యిస్తాను'' అన్నాను. ఆ తర్వాత జరిగిం దంతా నీకు తెలిసిందే అని ముగించాడు వాడు.

తెల్లబోయాను నేను

అప్పుడనిపించింది. ఎంత మంచి మనిషి అయినా వాడిలోనూ బలహీనత లున్నాయని రోహిణీ ఎడల వాడిలో అంతర్గతంగా వున్న వాంఛ అలా బయ ల్పడి అపహాస్యం పాలయింది అది చెడు కాదంటావా?'' అని ముగించారు చౌదరి.

కరణం జగన్నాధం జవాబు చెప్ప లేదు. చీకటి పడిపోయింది బాగా. చంద మామ పసిపిల్లాడిలా నవ్వుకుంటూ పైకి వొస్తున్నాడు ఇళ్ళల్లో దీపాలు వెలి గాయి. పక్షుల కూజితాలు సద్దుమణి గాయి ఆ నిశ్శబ్దంలోంచి మధ్యమధ్య పశువుల అంబా రవాలు వినవస్తోన్నాయి సౌమ్యంగా నెమ్మదిగా

నిట్టూర్చి సన్నగా నవ్వాడు జగన్నాధం. వొంచిన తలఎత్తి చౌదరి గారివంక చూసి ''బావుంది'' అన్నాడు. అర్ధమైనట్లుగా నవ్వారు చౌదరి.

''నీ భావంకూడా సబబయినదే జగ న్నాధం' వాడిమీద మీరు చూపుతోన్న గౌరవమూ, అభిమానమూ నాలో అంత ర్గతంగా కలిగించిన ఈసు వలన ఈ సంఘటన నీకు చెప్పానేమో? మరి, నేనూ మనిషినేగా?''

జగన్నాధం తెల్లబోయి ఆయనవంక చూశాడు'

★